సాక్షి జగిత్యాల

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



'సాక్షి' 'సెల్ఫీ విత్ గణేశ్'కు జిల్లాకేంద్రానికి చెందిన రాజేందర్ స్పందించారు. జిల్లాకేంద్రంలోని బైపాస్ రోడ్డులో 40 ఫీట్ల ఎత్తున్న మట్టి గణపతి వద్ద కుటుంబ సమేతంగా పూజలు చేస్తున్న ఫొటోను పంపించారు. మట్టి గణపతితో సెల్ఫీ దిగడం సంతోషంగా ఉందన్నారు.

– జగిత్యాలటౌన్

సెల్ఫీ విత్ మట్టిగణేశా..

పర్యావరణాన్ని కాపాడేలా మట్టిగణేశుని ప్రతిష్ఠించారా.. ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ లేదా ఇళ్లలో మట్టి వినాయకులను పూజిస్తున్నారా.. అయితే మీరు పర్యావరణహిత గణేశునితో సెల్ఫీఫొటో తీసుకుని సెల్ నంబరు 95426 16103కు వాట్సప్ చేయండి. మీరు పంపిన ఫొటోను 'సాక్షి' దిన పత్రికలో ప్రచురిస్తాం.



న్యూస్‌రీల్

అంగన్‌వాడీల కలెక్టరేట్ ముట్టడి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

జగిత్యాలటౌన్: అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి వీడి అంగన్‌వాడీల న్యాయమైన సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. కనీస వేతనం అమలు చేసి గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుతారి రాములు, ఎండీ.ముక్రం, ఉస్మాన్, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయిఈశ్వరి, భాగ్య, దయావతి, నీలవేణి, పద్మ, సంధ్య, ఇంద్ర, మమత, సుమలత పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాడాలి



మాట్లాడుతున్న వెంకట్రాములు

కోరుట్ల: బీసీలు తమ హక్కుల సాధనకు రాజకీయలకతీతంగా పోరాడాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. పట్టణంలోని సీ ప్రభాకర్ స్మారక గ్రంథాలయంలో బుధవారం బీసీ హక్కుల సాధన సమితి నియోజకవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలు సామాజిక న్యాయానికి నోచుకోవటం లేదన్నారు. కేంద్రం బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి బీసీ కుల గణన చేసి జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, నాయకులు చెన్న విశ్వనాథం, జక్కుల ప్రసాద్, రాచకొండ దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నూతన నిర్మాణాలకు ప్రణాళిక



కొలతలు పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: జిల్లాలోని పురాతన ఆలయాల ఆవరణలో నూతన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస పౌలస్తేశ్వరస్వామి ఆలయంలో గాలిగోపురం, గోశాల నిర్మాణానికి, పట్టణంలోని మార్కెట్ ఆవరణలోగల శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆర్చిగేట్, దేవాలయ మండపం పునర్నిర్మాణం, శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో ధర్మశాల, వాణీనగర్ ఆలయం పునఃనిర్మాణం, ఆలయ మండపం నిర్మాణానికి కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకే నూతన నిర్మాణాలు చేపడతామన్నారు. ఈవో వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్లు రవి, భార్గవ్ పాల్గొన్నారు.

వైద్య సేవల రికార్డులు సిద్ధం చేయాలి

- డీఎంహెచ్‌వో పుప్పాల శ్రీధర్



మల్యాల: వైద్య సేవల రి కార్డులు సిద్ధం చేయాలని, ఈ నెల 25న నేషనల్ క్వా లిటీ అష్యూరెన్స్ స్టాండర్స్ టీం రానున్నదని డీఎంహెచ్‌వో శ్రీధర్ అన్నారు. మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం నూకపల్లిలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎస్.శ్రీనివాస్, డాక్టర్ మౌనిక, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమల దాడి

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



ఈ చిత్రం నర్సింగాపూర్‌కు వెళ్లే రహదారి. పక్కనే డ్రెయినేజీ దుర్వాసన వెదజల్లుతున్నా.. కనీస చర్యలు తీసుకోవడం లేదు. పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీనిచుట్టూ అపార్ట్‌మెంట్స్ ఉండటంతో దోమలు విపరీతంగా వస్తున్నాయని, చేసేదేమీలేక ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు అంటున్నారు. ఇక్కడ పందులు కూడా సంచరిస్తున్నాయి.



ఇది జిల్లాకేంద్రంలోని గణేశ్‌నగర్‌కాలనీ. ఇలా ఇళ్ల మధ్య ఖాళీస్థలాలు మురికికుంటలను తలపిస్తున్నాయి. ఫలితంగా ఆ కాలనీ మొత్తం దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు విపరీతంగా పెరిగి ఇళ్లలోకి వచ్చి కుడుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నీటిగుంతల్లో కనీసం ఆయిల్‌బాల్స్ గానీ, కెమికల్స్‌గానీ చల్లడం లేదు. పిచ్చిమొక్కలూ ఏపుగా పెరిగి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోంది.



ఇది జాంబాగ్ ప్రాంతంలోని కాలనీ. ఇళ్లను ఆనుకుని పెద్ద మురికికాలువ ఉండటం.. ఈ నీరు ఎటూ వెళ్లడం లేదు. రాత్రి అయ్యిందంటే విషపురుగులు, దోమలు వస్తున్నాయని కాలనీవాసులు అంటున్నారు. కనీసం పిచ్చిమొక్కలు కూడా తొలగించడం లేదని చెబుతున్నారు. మున్సిపల్ సిబ్బంది స్పందించి వాటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- గ్రామాల్లో లోపిస్తున్న పారిశుధ్యం
- జనావాసాల్లోనే నీటి నిలువలు
- మురికినీటితో తీవ్ర దుర్గంధం
- విషజ్వరాల బారిన ప్రజలు
- రోజురోజుకూ పెరుగుతున్న డెంగీ కేసులు

జనవరి నుంచి ఇప్పటివరకు

డెంగీ కేసులు	77
మలేరియా	2

జగిత్యాల: జిల్లాకేంద్రంలో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇటీవలి వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీటి నిలువలు పెరగడం.. మురికినీరు తోడుకావడంతోదోమలు, ఈగలు ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ఫలితంగా ఇంటికొకరు డెంగీ బారిన పడుతున్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు 77 కేసులు నమోదయ్యాయంటే తీవ్రతను అర్థం చేసుకో వచ్చు. ఇది అధికారిక లెక్కల ప్రకారమే.. అనధి కారికంగా మరిన్ని డెంగీ కేసులు ఉంటాయని ప్రై వేటు వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ఎలిసా టెస్ట్ ద్వారానే డెంగీ నిర్ధారణ కావడం.. ఆ సెంటర్ జిల్లాకేంద్రంలో ఇటీవలే ఏర్పాటు చేయడంతో జిల్లావాసులకు వరంగా మారింది. దాంతోనే డెంగీ కేసులు బయటపడుతున్నాయి. గతంలో కరీంనగర్‌లో ఉండటంతో ఇబ్బందికరంగా ఉండేది.

నివారణ చర్యలు శూన్యం

దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగానే ఉంటోంది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో పారిశుధ్యలోపంతోనే డెంగీ కేసులు పెరుగుతున్నాయని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. అర్బన్ కేంద్రాలతోపాటు ఈసారి రూరల్ ప్రాంతాల్లో కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా నిలువ ఉండే నీరు, కొబ్బరిబొండాలు, టైర్లలో నిలిచిన నీటిద్వారానే దోమలు వృద్ధి చెందుతున్నాయి. నీటి నిలవ్లను తొలగించాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామపంచాయతీ, పురపాలికల్లో డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్నప్పటికీ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా అపరిశుభ్ర వాతావరణం ఉండడంతోనే రోగాలు పెరుగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, జగిత్యాల అర్బన్, మేడిపల్లి, నేరెళ్లలో అత్యధిక కేసులు నమోదయ్యాయని జిల్లా వైద్యాధికారి తెలిపారు.

విషజ్వరాలే అధికం

దోమలు విజృంభిస్తుండడంతో విషజ్వరాలు వస్తున్నాయి. నెల రోజులుగా జగిత్యాల జనరల్ ఆస్పత్రికి నిత్యం 200కు పైగా జ్వరాలతో వస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో లెక్కకు మించి జ్వరాలతో బాధపడుతున్నారు. ప్లేట్‌లేట్స్ పడిపోతున్నాయని, డెంగీగా నిర్ధారణ కావడం లేదని, ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంటోందని వైద్యులు పేర్కొంటున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గితే భయపడొద్దని చెబుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విష జ్వరాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నా పారిశుధ్య లోపం శాపంగా మారింది.

ఫీవర్ సర్వే

జిల్లాలో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు, వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. వ్యాధిగ్రస్తులున్న ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేయడంతోపాటు, మందులు అందజేస్తున్నారు. క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన ఇద్దరు డెంగీ బారిన పడగా.. ఈసారి ఎక్కువగా కోరుట్ల, రాయికల్, మేడిపల్లి, నేరళ్లలో జ్వరాల బారిన పడ్డారు.

చర్యలు తీసుకుంటున్నాం



దోమలు వ్యాప్తి అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాం. వైరల్ జ్వరాలు సోకే ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ముఖ్యంగా ప్రజలు నీరు నిలువ లేకుండా చూసుకోవాలి. వారికి అవగాహన కల్పిస్తున్నాం. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులు దరిచేరవు.

– శ్రీధర్, డీఎంహెచ్‌వో

ప్రజలకు ఇబ్బంది రానీయం



పారిశుధ్య నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. ఆయిల్‌బాల్స్ వేసేలా చర్యలు తీసుకుంటున్నాం. స్ప్రే సైతం చేపిస్తున్నాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. నిత్యం డ్రెయినేజీలు శుభ్రం చేసేలా చర్యలు చేపడుతున్నాం.

– అనిల్‌బాబు, జగిత్యాల మున్సిపల్ కమిషనర్

ఆరోగ్య తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యం



చల్‌గల్‌లో పల్లెఆసుపత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

- పల్లె దవాఖానాలతో ప్రజలకు మెరుగైన వైద్యం
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత
- అంతర్గాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన

జగిత్యాలరూరల్: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జగిత్యాలరూరల్ మండలం అంతర్గాం, చల్‌గల్ గ్రామాల్లో రూ.20లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి అదనపు కలెక్టర్ దివాకరతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రతి గ్రామంలో పల్లె దవాఖానాలు ఏర్పాటు చేశారని, నిరుపేద ప్రజలందరికీ గ్రామస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి 21 బస్తీ దవాఖానాలు మంజూరయ్యాయని తెలిపారు. కేంద్రప్రభుత్వం ఒక్క మెడికల్ కళాశాల కూడా తెలంగాణకు కేటాయించలేదని, కేసీఆర్ మాత్రం ప్రతి జిల్లాకో వైద్య కళాశాలను మంజూరు చేశారని తెలిపారు. జిల్లాకేంద్రంలో 27 ఎకరాల్లో వైద్య కళాశాలను నిర్మిస్తున్నట్లు వివరించారు. రూ.11 కోట్లతో కళాశాల చుట్టూ రహదారులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు ఉచితంగా 134 రకాల రక్తపరీక్షలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అనంతరం గ్రామంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నక్కల రాధ, సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, సర్పంచులు బోనగిరి నారాయణ, ఏళ్ల గంగనర్సు, గంగాధర్, ఎంపీటీసీ శ్రీనివాస్, ఏఈ రాజమల్లయ్య పాల్గొన్నారు.

పథకాలు సకాలంలో అమలుచేయాలి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: ప్రభుత్వ పథకాలను సకాలంలో అమలుపర్చాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పంట రుణాలు, ఎరువులు, జీవో నంబరు 58, 49, గృహలక్ష్మీ, ఆసరా పింఛన్లు సకాలంలో అందేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. ఆయిల్ పాం సాగుపై రైతులను ప్రోత్సహిస్తున్నామని, ప్రస్తుతం సోయా, మొక్కజొన్న సాగు చేస్తున్నారని అధికారులు తెలిపారు. పంట రుణమాఫీ రైతుల ఖాతాలో జమ అవుతోందని, ఆసరా పింఛన్లు అందరికీ ఇస్తున్నామని పేర్కొన్నారు. పంచాయతీ భవనాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా తెలిపారు. ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ దివాకర, ఏవో సురేశ్, డీఆర్డీఏ పీడీ నరేశ్, పంచాయతీ అధికారి దేవరాజ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- మోసపోతే 1930కు ఫోన్ చేయండి
- ఎస్పీ ఎగ్గడి భాస్కర్



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: సైబర్‌నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు మోసంచేస్తే వెంటనే 1930కు కాల్ చేయాలని, ఎన్సీఆర్పీ పోర్టల్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. జిల్లాలో 20 రోజుల్లో టోల్‌ఫ్రీ నంబరు 1930, ఎన్సీఆర్పీ పోర్టల్‌కు 33 ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో బాధితుల లెక్కప్రకారం రూ.12,51,860 కోల్పోయారని తెలిపారు. ఇందులో రూ.4,58,018 ఫ్రీజ్ చేశామన్నారు. ఏదో ఒక వ్యక్తికి ఆశ చూపి తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు వస్తాయని అతని నుంచి వ్యక్తిగత సమాచారం తీసుకుని సైబర్ నేరాలు చేస్తున్నారని వివరించారు. జిల్లాలో యూపీఐ సంబంధిత మోసాలు 13, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మోసాలు 5, డెబిట్, క్రెడిట్‌కార్డు సిమ్ మోసాలు 1, సైబర్ బుల్లింగ్ 4, ఈవ్యాలెట్ మోసాలు 2, చీటింగ్ ఇన్సర్మేషన్ 2, ప్రొఫైల్ హ్యాకింగ్ 1, డిపాజిటరీ ఫ్రాడింగ్ 2, ఆన్‌లైన్ జాబ్ మోసాలు 1, ఫేక్ ప్రొఫైల్ 1, ఇతర మోసాలు ఒకటి చొప్పున మోసాలు వెలుగుచూశాయన్నారు.

కాంగ్రెస్ చెప్పేవన్నీ అబద్ధాలే

- ఆ పార్టీని నమ్మి మోసపోవద్దు
- ప్రజా ఆశీర్వాద యాత్రలో మంత్రి కొప్పుల ఈశ్వర్



పెగడపల్లి: మంత్రికి తిలకం దిద్దుతున్న మహిళ

పెగడపల్లి: కాంగ్రెస్ నాయకులు చెబుతున్నవన్నీ అబద్ధాలేనని.. వారి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెగడపల్లి మండలం ల్యాగలమర్రి, దీకొండ, నంచర్లలో బుధవారం ప్రజాఆశీర్వాద యాత్ర చేపట్టారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్‌గా ఉందన్నారు. అమలు సాధ్యంగాని హామీలిచ్చి అధికారంలోకి రావాలని కాంగ్రెస్ చూస్తోందని, ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రైతుల కోసం 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబీమా, రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ అందిస్తున్న ప్రభుత్వాన్ని మరిచిపోవద్దని సూచించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అందుతున్నాయా..? లేదా..? తెలుసుకునేందుకే యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయంలో 63 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. మద్దులపల్లిలో రూ.4.20 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు, పెగడపల్లిలో రూ.2కోట్లతో ఎస్సీ వసతి గృహం నిర్మాణానికి శంకుస్థాపన, దీకొండలో రూ.25లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, సర్పంచులు వనజ, భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ అంజయ్య, విండో చైర్మన్లు రమణారావు, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, వైస్ ఎంపీపీ గంగాధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆంజనేయులు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లారెడ్డి, వెంకన్న, అడ్వైజరీ కమిటీ చైర్మన్ ఆనందం, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభ విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న బుద్దుల గంగనర్సయ్య

మల్లాపూర్: ఎస్సీ ఉపకులాల ఆత్మగౌరవ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాస్టీన్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుద్దుల గంగనర్సయ్య అన్నారు. మండల కేంద్రంలో మాట్లాడారు. ఎస్సీ ఉపకులాలకు దళితబంధు, గృహలక్ష్మీ, మూడెకరాల భూపంపిణీ, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు దక్కడం లేదన్నారు. తహసీల్దార్ కార్యాలయాల నుంచి ధ్రువీకరణపత్రాలు ఇవ్వకపోవడంతో ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని పేర్కొన్నారు. వచ్చే 4న హైదరాబాద్‌లో నిర్వహించే ఉపకులాల ఆత్మగౌరవ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. బుడగ జంగాలు, మోచి, మాస్టీన్ కులసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలకు జాతీయస్థాయి గుర్తింపు

- ఎన్‌క్వాస్ అవార్డుకు ధరూర్, వేములకుర్తి పీహెచ్‌సీలు ఎంపిక
- మూడేళ్లపాటు విడుదల కానున్న నిధులు



ధరూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలోని ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్రబృందం(ఫైల్)

జగిత్యాలరూరల్/ఇబ్రహీంపట్నం: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన చికిత్స, వసతులు కల్పిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కేంద్రబృందం ద్వారా సర్వే చేయించి అవార్డులకు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని జగిత్యాల అర్బన్ మండలం ధరూర్, ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జాతీయ బృందం ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్) అవార్డుకు ఎంపిక చేసింది. స్వచ్ఛ గ్రామీణ్‌కు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఈ రెండు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు జాతీయ పురస్కారాలు సొంతం చేసుకున్నాయి. క్షేత్రస్థాయిలో సమస్యలు అధిగమిస్తూ జాతీయ ప్రమాణాలు పాటించాయి.

రెండురోజులు పరిశీలన

కేంద్రప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా అందించే అత్యుత్తమ పురస్కారానికి ఎంపిక చేసేందుకు ఎన్‌క్వాస్ బృందం వేములకుర్తి ఆరోగ్య కేంద్రాన్ని ఆగస్టు 17న, ధరూర్ కేంద్రాన్ని అదేనెల 19న పరిశీలించింది. వేములకుర్తి కేంద్రానికి 82 పాయింట్లు, ధరూర్ కేంద్రానికి 79 పాయింట్లు కేటాయించారు. ఆరోగ్య కేంద్రాలకు ఎంతమంది వైద్యం కోసం వస్తున్నారు..? ల్యాబ్ వసతి ఉందా..? పీహెచ్‌సీ ఆవరణలో పరిశుభ్రత, పచ్చదనం ఎలా ఉన్నాయి..? అనే దాని ఆధారంగా కేంద్ర బృందం అధికారులు పాయింట్లు కేటాయించారు.

అంశాల ప్రామాణికంగా ఎంపిక..

జాతీయ ఆరోగ్య మిషన్ జారీచేసిన వివిధ అంశాలను ప్రామాణికంగా తీసుకుని జాతీయ పురస్కారాలకు ఎంపిక చేశారు. పీహెచ్‌సీకి ఎంతమంది రోగులు వస్తున్నారు.. ఇన్‌పేషెంట్లుగా చేరిన వారికి అందిస్తున్న సేవలు.. ల్యాబ్‌లు, మందులు అందిస్తున్న తీరు.. నిల్వలు.. మాతా శిశు సేవలు.. ప్రసవాల గది, హరితహారం, జల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, మెడికల్ వ్యర్థాల నిర్వహణను పరిశీలించారు.

ఏటా రూ.2 లక్షలు విడుదల..

కేంద్రప్రభుత్వ అందించే ఎన్‌క్వాస్ అవార్డు కింద ఏటా రూ.1.50లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ధరూర్, వేములకుర్తి పీహెచ్‌సీలకు మంజూరు చేస్తారని అధికారులు తెలిపారు. ఇలా మూడేళ్లపాటు నిధులు అందనున్నాయి. అవార్డు నిధులను పీహెచ్‌సీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వెచ్చించాల్సి ఉంటుంది. పీహెచ్‌సీల అభివృద్ధికి వచ్చే సాధారణ నిధులతోపాటు అదనంగా ఎన్‌క్వాస్ నిధులు రావడంతో మరింత అభివృద్ధి చెంది ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి.

మెరుగైన వైద్యసేవలతో గుర్తింపు



ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో జిల్లాలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎన్‌క్వాస్ అవార్డులు దక్కాయి. అధికారులు, వైద్యసిబ్బంది సమష్టి కృషితో ఈ అవార్డులు దక్కాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహకారం మరవలేనిది.

– శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

ఎమ్మెల్సీ కవితను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు



దుర్గాదేవి చిత్రపటాన్ని బహూకరిస్తూ..

జగిత్యాలజోన్: ఎమ్మెల్సీ కవితను జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత దంపతులు బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. మహిళా రిజర్వేషన్లపై ఢిల్లీలో పోరాడి.. సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారంటూ కవితను సన్మానించారు. దుర్గాదేవి చిత్రపటాన్ని బహూకరించారు.

జిల్లాస్థాయి పోటీలకు మల్యాల విద్యార్థులు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మల్యాల: మండలకేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలకు చెందిన 14మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ విశ్వప్రసాద్ తెలిపారు. గణేశ్, వినోద్, రాంచరణ్, రాకేశ్, శివాజీ, రోహిత్, సుదర్శన్, మహేశ్, ఇలియాస్, సోహెల్, హుస్సేన్, అక్షయ్, చరణ్‌తేజ, అఖిల్ మండలస్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంఈఓ ఐత శ్రీనివాస్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సతీశ్‌బాబు, ఉపాధ్యాయులు రవీందర్, శ్రీధర్ విద్యార్థులను అభినందించారు.

బహ్రెయిన్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు



వినాయక చవితి వేడుకల్లో పద్మశాలీలు

కోరుట్ల: బహ్రెయిన్‌లో పద్మశాలీ సమాజ్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మనామాలోని మహారాష్ట్ర కల్చరల్ హాల్‌లో వినాయక ప్రతిమను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో పద్మశాలీ బహ్రెయిన్ గౌరవ అధ్యక్షుడు అల్లె గంగాధర్, అధ్యక్షుడు వేముల కృష్ణ, ఉపాధ్యక్షుడు గంగుల సుదర్శన్, కార్యదర్శి బాలె శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికై నట్లు పీఈటీ వినోద్ తెలిపారు. ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్–14, 17 విభాగాల్లో 26 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యవసాయ మోటార్లు చోరీ

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం కిష్టంపేట, జోగాపూర్ గ్రామాలకు చెందిన రైతుల వి ద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. కిష్టంపేటకు చెందిన గసికంటి రాములు, తాళ్లపెల్లి గంగారాంలకు చెందిన రెండు మోటార్లను ఎత్తుకెళ్లినట్లు వివరించారు.

ఉత్తుత్తి ఆఫర్ లెటర్లు..!



చైతన్య, కోరుట్ల

'మాది కోరుట్ల. కెనడాకు వెళ్దామని మా ఫ్రెండ్ ద్వారా బీర్‌పూర్ మండలం కొల్వాయికి చెందిన సాయితేజను ఏడాది క్రితం సంప్రదించిన. ఆయన నా దగ్గర రూ.ఏడు లక్షలు తీసుకున్నాడు. నకిలీ ఆఫర్ లెటర్ ఇచ్చి మెడికల్, బయోమెట్రిక్ చేయించాడు. తరువాత రెండు నెలలకు ఆయనే అవి నకిలీవని చెప్పి మీ డబ్బులు మీకు ఇస్తానన్నాడు. తరువాత ఓ చెక్ ఇచ్చాడు. అది బౌన్స్ అయింది. నెలరోజులుగా సాయితేజ ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. వాళ్లింటికి వెళితే ఇంట్లో ఎవరూ లేరు.

- యూరప్ దేశాలకు పంపుతానని నకిలీ పత్రాలతో మోసం
- 25 మంది యువకులకు టోకరా
- ఆందోళనలో బాధితులు పోలీసులకు ఫిర్యాదు

కోరుట్ల: ఇలా ఒకరిద్దరు కాదు.. సుమారు 25 మంది యువకులను కెనడా, జర్మనీ వంటి దేశాలకు పంపిస్తానని చెప్పి సాయితేజ అనే ఏజెంట్ సుమారు రూ.కోటి వరకు దండుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీళ్లంతా జగిత్యాల పోలీసులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నట్లు సమాచారం.

ఉత్త లెటర్లే..

సాధారణంగా కెనడా, జర్మనీ వంటి దేశాలకు వెళ్లే వారు ఆయా దేశాల్లో ఉన్న కంపెనీల్లో ఉద్యోగాలు ఉన్నట్లు వాటికి సంబంధించిన ఆఫర్ లెటర్లను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఈ ఆఫర్ లెటర్ల



బాధితులు నకిలీ ఆఫర్ లెటర్‌గా చెబుతున్న పత్రాలు

ఆసరాగా ఆయా కంపెనీలకు వెళ్లడానికి అవసరమైన అర్హతలు, మెడికల్, బయోమెట్రిక్ వంటి ఇతర అర్హత పత్రాలు జతచేయాల్సి ఉంటుంది. అయితే సదరు ఏజంట్‌గా పనిచేసిన వ్యక్తి యూరప్ కంపెనీల బోగస్ ఆఫర్ లెటర్లను సృష్టించి ఉపాధి కోసం వలస వెళ్లే యువకులకు ఇచ్చి వాటితో హైదరాబాద్‌లో మెడికల్, బయోమెట్రిక్, స్టాంపింగ్ చేయించడం గమనార్హం. ఇదే రీతిలో కొల్వాయికి చెందిన ఏజంట్ ఓ వ్యక్తిని జర్మనీకి పంపగా.. అతడిని అక్కడి ఎయిర్‌పోర్టు నుంచి తిప్పి పంపినట్లు సమాచారం.

కేసులు నమోదు చేశాం

యూరప్ దేశాలకు పంపిస్తానని నకిలీ పత్రాలు ఇచ్చి మోసం చేసినట్లు కొంతమంది యువకులు మాకు ఫిర్యాదు చేశారు. ఆయా యువకులు మోసపోయిన ఏరియాల్లోని పోలీస్‌స్టేషన్లలో రెండు కేసులు నమోదు చేశాం. – వెంకటస్వామి, డీఎస్పీ, జగిత్యాల

ఆందోళనలో యువకులు

జగిత్యాల, కోరుట్ల, బీర్‌పూర్, సారంగాపూర్ ప్రాంతానికి చెందిన సుమారు 25 మంది యువకులు ఏడాదిన్నరగా యూరప్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లాలన్న ఆశతో కొల్వాయికి చెందిన ఏజెంట్‌ను ఆశ్రయించినట్లు సమాచారం. అతడు ఒక్కో యువకుడి నుంచి సుమారు రూ.3 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు తీసుకుని కెనడా, జర్మనీ దేశాలకు పంపేతంతును పూర్తి చేసినట్లు సదరు ఏజెంట్ నమ్మించినట్లు తెలిసింది. సుమారు ఏడాదిన్నరపాటు తమను యూరప్ దేశాలకు పంపుతాడని ఆశపడ్డ యువకులు కొన్నాళ్లపాటు వేచిచూసి చివరకు తాము మోసపోయామని గుర్తించి పోలీసులను ఆశ్రయించారు.

మంత్రపురిలో 'భక్తి'ఉద్యమం

- మహారాష్ట్ర నుంచి మంథనికి..
- బాలగంగాధర్‌తిలక్ స్ఫూర్తి
- 106ఏళ్లుగా వినాయక ఉత్సవాలు
- నిజాం కాలం నుంచి కొనసాగింపు

మంథని: మంత్రపురిగా పేరొందిన మంథనిలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ 110 ఏళ్లుగా ఏటా వేడుకలు నిర్వహిస్తూ రాష్ట్రంలోనే గుర్తింపు చాటుకున్నారు. ఉత్సవాలు అంటే.. అందమైన సెట్టింగ్‌లు, అన్నదానాలు, పెద్ద ఎత్తున నిమజ్జనం ఊరేగింపులు.. ఇలాంటివి చూస్తాం. కానీ, మనదేశ స్వాతంత్య్ర ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి గణపతి నవరాత్రి ఉత్సవాలు దోహదం చేశాయనే విషయం చాలామందికి తెలియదు. ఆ వివరాలే ఇవీ..

బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తితో..

- బాలగంగాధరతిలక్ మహారాష్ట్రలోని ముంబయిలో వినాయక నవరాత్రి ఉత్సవాల పేరిట 1913లో నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించారు.
- ఆ ఉత్సవాల సందర్భంగా వంటలు తయారు చేసేందుకు మంథనికి చెందిన బ్రాహ్మణ సామాజికవర్గం మధ్యభారత్‌లోని నాగ్‌పూర్(ప్రస్తుత మహారాష్ట్ర)కు వెళ్లివచ్చేవారు.
- అంతేకాదు.. అక్కడి సంప్రదాయం తీసుకొచ్చారు. ఇక్కడ కూడా అదేవిధంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు.
- దైవభక్తి పేరిట మంటపాల వద్ద ప్రజలు కలసుకుని బ్రిటిష్‌తోపాటు నిజాం నిరంకుశ పాలనలకు వ్యతిరేకంగా ఐక్యఉద్యమాలకు వ్యూహరచన చేశారు.
- నాటి స్వాతంత్య్ర సమరానికి చిహ్నంగా నిలిచిన గణపతి నవరాత్రి ఉత్సవాలను సర్వ గణానన మండలి ఆధ్వర్యంలో ఒకేచోట నిర్వహించారు.

నిజాం కాలం నుంచి..

నిజాంకాలం నాటి వినాయక నవరాత్రి ఉత్సవాల సంస్కృతి, సంప్రదాయాలు కాలక్రమంలో అన్నిగ్రామాలకూ విస్తరించాయి. ఈ నేపథ్యంలోనే మంథని పెంజేరుకట్ట హనుమాన్ ఆలయంలో సిద్ధిబుద్ధి గణపతి ఉత్సవాలను 1913 నుంచి ఏటా నిర్వహిస్తున్నారు.



1913లో తొలిసారి ఉత్సవాలు నిర్వహించిన పెంజేరుకట్ట ఉత్సవ కమిటీ(ఫైల్)

- మోతారాంగారి రాజేశ్వర్‌రావు, టక్కేగారి మల్లన్న, మంథని లింగయ్య తదితరులు ఆనాడు ఉత్సవాలు నిర్వహించేవారు.
- అలాగే నడివీధిలో సర్వజన గజానన మండలి పేరిట 1918 నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.
- ఐదేళ్ల క్రితం శతవసంత ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు.
- రావులచెరువు కట్ట గజానన మండలి 99 సంవత్సరాలు పూర్తిచేసుకుంది. వచ్చేఏడాది శతవసంతాల్లో అడుగుపెట్టనుంది.
- మందాటవీధిలో అరవై ఏళ్లుగా ఏటా గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటున్నారు.

నాగ్‌పూర్, మంథనిలోనే సిద్ధిబుద్ధి..

నాగ్‌పూర్, మంథని మినహా దేశంలో ఎక్కడా సిద్ధిబుద్ధి(భార్యలు) విగ్రహాలతో గణేశ్ దర్శనం లభించదు. వంటలకు వెళ్లినవారు నాగ్‌పూర్‌లో గణపతి విగ్రహాన్ని తీసుకుని రైలులో బల్లార్షా వరకు వచ్చి.. అక్కడ విగ్రహం కనిపించకుండా గుడ్డలు చుట్టి, ఎడ్లబండిలో మంథని సమీప గోదావరి తీరం వరకు చేరుకున్నారు. అక్కడి నుంచి కాలిబాటన నిజాం పోలీసుల కంట పడకుండా మంథనికి చేరారని చెబుతున్నారు.

105 ఏళ్లుగా ఏటా ఉత్సవాలు



మంథని నడివీధి సర్వజన గణానన మండలి వినాయక నవరాత్రి ఉత్సవాలను 105 ఏళ్లుగా ఏటా నిర్వహిస్తోంది. వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఐదేళ్ల క్రితం ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నాం. నిత్యం భజనలు చేస్తున్నాం. భక్తిశ్రద్ధలతో గణపతిని పూజిస్తున్నాం.
– శశిభూషణ్ కాచే, స్థానికుడు, మంథని

శత వసంతోత్సవాలకు సన్నద్ధం



ఆనాటి హిందువుల ఐక్యత, నిజాం నవాబులకు వ్యతిరేకంగా నవరాత్రి ఉత్సవాలను వేదికగా చేసుకున్నారు. అప్పటి నుంచి రావులచెరువు కట్ట అభయాంజనేయస్వామి ఆలయంలో 99ఏళ్లుగా ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వచ్చే ఏడాది వందళ్లు పూర్తవుతాయి. వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటినుంచే సన్నాహాలు చేస్తున్నాం. – బొబ్బిలి శ్రీధర్, ఉత్సవ సమితి అధ్యక్షుడు, రావుల చెరువులకట్ట

కాంగ్రెస్ అంటేనే అవినీతి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు
- కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే

రాయికల్: అవినీతికి కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఎద్దేవా చేశారు. రాయికల్ మండలం చింతలూరులో వివిధ పార్టీలకు చెందిన యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా.. ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ హయాంలో అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికీ చేరాయని గుర్తుచేశారు. సీఎం ప్రవేశపెడుతున్న పథకాలను చూసి ఓర్వలేకనే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తోందని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఏఎంసీ చైర్మన్ మారంపల్లి రాణి, సర్పంచ్ అనుపురం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు

జిల్లాస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

జగిత్యాలటౌన్: క్రీడలతో మానసికంగా, శారీరకంగా ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న అండర్–14, 17 బాల,బాలికల జిల్లాస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు అండర్–17 బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి లక్ష్మీరాంనాయక్ తెలిపారు. కబడ్డీలో మల్యాల జట్టు ప్రథమ, మెట్‌పల్లి జట్టు ద్వితీయ, ఖోఖోలో మల్యాల ప్రథమ, మేడిపల్లి ద్వితీయ, వాలీబాల్‌లో మల్యాల ప్రథమ, రాయికల్ జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీఈవో జగన్మోహన్‌రెడ్డి, బల్దియా చైర్మన్ గోలీ శ్రీనివాస్, జిల్లా క్రీడల అధికారి రవికుమార్, పెటా అధ్యక్షుడు పడాల విశ్వప్రసాద్, సెక్రెటరీ అశోక్, పీడీలు, పీఈటీలు పడాల క్రిష్ణప్రసాద్, శ్రీనివాస్, అజయ్‌బాబు, కోటేశ్వర్‌రావు, వేణు, జమునారాణి, మల్లేశ్వరి, వెంకటలక్ష్మి, పుష్పలత పాల్గొన్నారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు ప్యాక్స్ చైర్మన్, గ్రామస్తుల ఫిర్యాదు

మల్లాపూర్ : ఫారెస్టు బీట్ ఆఫీసర్ సత్తార్‌పై చర్యలు తీసుకోవాలని ప్యాక్స్ చైర్మన్ వేంపేట నర్సారెడ్డి, మల్లాపూర్ గ్రామస్తులు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుకు ఫిర్యాదు చేశారు. మల్లాపూర్ పరిధి అటవీ ప్రాంతంలో గ్రామస్తులు వంతులవారీగా కాపలా ఉంటూ టేకు (కలప) చెట్లను కాపాడుకుంటున్నామని, సత్తార్ బాధ్యతలు చేపట్టి నుంచి టేకుచెట్ల నరికివేత, అక్రమంగా రవాణా అవుతోందని తెలిపారు. అటవీశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే అటవీశాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బీట్ అధికారిపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రైతులు ముత్యాల చంద్రశేఖర్, తోట లక్ష్మీనారాయణ, ముత్యాల శంకర్, పుప్పాల మహేష్, నవీన్, భూమారెడ్డి, చిన్నారెడ్డి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

ఎస్సారెస్పీ భూములు రక్షించండి

- ఎస్సారెస్పీ డీఈకి రైతుల వినతి



డీఈకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

రాయికల్: మండలంలోని శ్రీరాంనగర్‌లో ఎస్సారెస్పీ భూములను కొందరు రైతులు కబ్జా చేస్తున్నారని, వాటిని రక్షించాలని ఎస్సారెస్పీ డీఈ, సీఈలకు రైతులు వినతిపత్రం అందించారు. భూ ములను రక్షించకుంటే అన్యాక్రాంతమయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు. నాయకులు శ్రీరాంగౌడ్, దండవేని లక్ష్మణ్, బాలయ్య, శ్రీనివాస్, హన్మంతు, రమేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

కొల్వాయిలో వైద్యశిబిరం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయిలో వైద్యశాఖ అధికారులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో జ్వరాలు ప్రబలుతుండడంతో 'పెరుగుతున్న జ్వరపీడితులు' శీర్షికన 'సాక్షి' బుధవారం కథనం ప్రచురించింది. స్పందించిన జిల్లా వైద్యశాఖ అధికారులు గ్రామంలో శిబిరం ఏర్పాటు చేసి డెంగీ అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఇంటింటా పర్యటించి సర్వే నిర్వహించారు. జిల్లా డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, జిల్లా సమగ్ర శిశు సంరక్షణాధికారి డాక్టర్ జయపాల్‌రెడ్డి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. జ్వరాలు పూర్తిగా అదుపులోకి వచ్చేవరకూ శిబిరం కొనసాగుతుందని వెల్లడించారు. సర్పంచ్ మేసు ఏసు, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

సాక్షి స్పందన

డ్రైవర్‌ను బెదిరించి ఆటో ఎత్తుకెళ్లిన ఆగంతకులు

మల్యాల(చొప్పదండి): జగిత్యాల జిల్లాకేంద్రం నుంచి కొండగట్టు వెళ్లేందుకు ఆటోను కిరాయి మాట్లాడుతున్న ఆగంతులు డ్రైవర్‌ను కొట్టి, ఆటో ఎత్తుకెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల16న గీకురు రాములు తన ఆటోతో జిల్లాకేంద్రంలో ఉన్నాడు. ఆయన వద్దకు ఇద్దరు ఆగంతకులు వచ్చారు. కొండగట్టు వెళ్లాలని కిరాయి మాట్లాడుకుని ఆటోలో బయల్దేరారు. ముత్యంపేట శివారుకు చేరుకోగానే రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలోకి ఆటోను తీసుకెళ్లి, రాములును బెదిరించి, దాడి చేశారు. అతని వద్దనున్న రూ.7వేలు లాక్కున్నారు. ఆటోను ఎత్తుకెళ్లారు. బాధితుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

టేకు కలప పట్టివేత

చందుర్తి(వేములవాడ): కొత్తపేట అటవీ ప్రాంతంలో అక్రమంగా నిలువ ఉంచిన టేకు కలపను అట వీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి రాఘవేంద్రరావు, బీట్ ఆఫీసర్ బాలకృష్ణ బుధవారం పట్టుకున్నారు. అటవీ ప్రాంతంలో టేకుదుంగలను నిలువ ఉంచా రన్న సమాచారంతో దాడి చేయగా రూ.80వేల వి లువైన రెండు ట్రాక్టర్ల కలప లభించినట్లు తెలిపారు. కలపను కల్లెడ డిపోకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగల అరెస్ట్

సిరిసిల్లక్రైం: చిన్నపిల్లల సహాయంతో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను, ఒక బాలుడిని సిరిసిల్ల టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం తెలిపారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం బర్ధమాన్ జిల్లా జమున మండలం ఆజాద్‌నగర్‌కు చెందిన రాజకుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్ జిల్లా బుక్కరాయసముద్రం మండలం గిరిప్రసాదనగర్‌కు చెందిన పాముల శివయ్య సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.2లక్షల విలువైన నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై సిరిసిల్ల టౌన్‌లో 5 కేసులు, వేములవాడ టౌన్, తంగళ్లపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఒక్కో కేసు నమోదైనట్లు వివరించారు. పండుగ రోజుల్లో జనాలు ఎక్కువగా గుమిగూడె ప్రదేశాలు, మార్కెట్ ఏరియాలలో చిన్నపిల్లల సహాయంతో సెల్‌ఫోన్ల చోరీకి యత్నిస్తున్నట్లు తెలిపారు. రద్దీ ఉండే ప్రదేశాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు.

పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న ముఠా అరెస్ట్

కోనరావుపేట(వేములవాడ): పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న ముఠాను రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట పోలీసులు అరెస్టు చేశారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వివరాలు వెల్లడించారు. మండలం ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల రాజలింగం వద్ద ఈనెల 6వ తేదీన 80 నాటుబాంబులు లభించాయి. రాజలింగంను అదుపులోకి తీసుకుని విచారించగా.. తానే నాటుబాంబులను తయారు చేస్తానని, కావాల్సిన ముడిసరుకును కామారెడ్డికి చెందిన గుర్తుతెలియని మహిళ సరఫరా చేస్తుందని తెలిపారు. సీఐ ఆధ్వర్యంలో ఎస్సై ఆంజనేయులు, కానిస్టేబుళ్లు దండి నరేశ్, నవీన్, తిరుపతి, బాలనర్సయ్య బృందంగా ఏర్పడి విచారణ చేపట్టారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డికి చెందిన మానెపల్లి చంద్రకళ(65) వద్ద 3 కిలోల పేలుడు పదార్థాల ముడిసరుకు లభించింది. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులు వచ్చి సరుకులు అందిస్తారని ఆమె అంగీకరించింది. ఈనెల 19న ఎప్పటిలాగానే ముడిసరుకును అందజేయడానికి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన జగదీశ్ బహోటిని అదుపులోకి తీసుకొని విచారించగా రెండు కిలోల ముడిసరుకు దొరికింది. అతను సరుకును తీసుకొచ్చే బేగంబజార్‌లోని దుకాణంపై దాడి చేసి నారాయణదాస్ సార్దను, అతని అనుచరుడు విఠల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 కిలోల పేలుడు పదార్థాల ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని వివరించారు.



అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కట్నం వేధింపులకు వివాహిత బలి

- నాలుగేళ్ల క్రితం ఆదర్శ వివాహం
- ఉపాధి కోసం విదేశాలకు భర్త
- అక్కడి నుంచే ఫోన్‌లో వేధించిన భర్త
- జత కలిసిన అత్తామామలు
- అనాథగా మూడేళ్ల కూతురు..

కథలాపూర్(వేములవాడ): కులం వేరైనా నచ్చిన యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. కొన్నాళ్లు సవ్యంగా సాగిన వారి దాంపత్య జీవితానికి కూతురు కూడా పుట్టింది. కూతురు కాపురం సజావుగా సాగుతుందని భావించి ఆ యువతి తల్లిదండ్రులు రూ.10లక్షల కట్నం ముట్టజెప్పారు. ఇంతలోనే ఆమెకు అదనపు కట్నం వేధింపులు ప్రారంభమయ్యాయి. భర్తతోపాటు అత్తామామలు పోరుపెడుతున్నారు. వాటిని తాళలేక ఆ యువతి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కథలాపూర్ మండలం దూలూర్ గ్రామంలో బుధవారం వెలుగు చూసింది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. కోరుట్ల పట్టణానికి చెందిన యాగండ్ల దీప అలియాస్ పిల్లి దీప, దూలూర్ గ్రామానికి చెందిన యాగండ్ల ప్రదీప్ నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారు అన్యోన్యంగా ఉండడంతోపాటు కూతురు (3) కూడా జన్మించడంతో దీప తల్లిదండ్రులు కొద్దిరోజుల క్రితం రూ.10 లక్షలు ముట్టజెప్పారు. ఈ క్రమంలో ప్రదీప్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. ఆయన వెళ్లినప్పటి నుంచి అత్తమామలు దీపను అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నారు. ఇదే విషయాన్ని భర్త ప్రదీప్‌కు చెబితే అతడు కూడా ఫోన్‌లో వేధించడం ప్రారంభించాడు. అటు కట్టుకున్న భర్త.. ఇటు అత్తామామలు వేధిస్తుండడంతో తట్టుకోలేని దీప మంగళవారం అర్ధరాత్రి తర్వాత తన ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్నికోణాల్లో విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దీపను ఆమె భర్తతోపాటు అత్తమామలు అదనపు కట్నంకోసం వేధించడంతోనే ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి పిల్లి రాధ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డీఎస్పీ వెంట కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, కథలాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ ఉన్నారు. తల్లి చనిపోవడం.. తండ్రి గల్ఫ్‌లో ఉండడంతో దీప కూతురు అనాథగా మారింది.



దీప (ఫైల్)

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

- రోడ్డు పక్కకు దూసుకెళ్లిన వైనం
- 10 మంది ప్రయాణికులకు గాయాలు

మల్లాపూర్: ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లగా.. అందులో ప్రయాణిస్తున్న 10 మంది గాయపడిన ఘటన మల్లాపూర్ మండలం మొగిలిపేట శివారులో బుధవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం మెట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 25 మంది ప్రయాణికులతో మెట్‌పల్లి నుంచి ఖానాపూర్‌కి వెళ్తోంది. మొగిలిపేట శివారులోకి రాగానే ఎదురుగా వాహనాలు అడ్డుగారావడంతో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్, కండక్టర్ తోపాటు మరో 10మంది ప్రయాణికులు గాయపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న మెట్‌పల్లి డిపో మెనేజర్ వేదావతి సంఘటన స్థలానికి చేరుకున్నారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారిని 108లో మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మల్లాపూర్ పోలీసులు విచారణ చేపట్టారు.



రోడ్డుపక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు